వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 280
పేజీలు : 08 | వెల: రూ.5/-
బుధవారం
ఆగస్టు 13, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



2లో..

## కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయండి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- కేంద్ర పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి సంజయ్ కుమార్ కు వినతి

# ముంపు కారణాలపై.. అన్వేషణ



వివరాలు 2లో..

- శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు
- క్షేత్రస్థాయిలో పర్యటించిన అధికారులు
- భద్రకాళి బండ్ వెనక నీటి ప్రవాహ తీరు పరిశీలన
- అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ పిలుపు

వరద ముంపు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. ముంపు కారణాలపై అధికారులు అన్వేషిస్తున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ఇప్పటికే నీట మునిగిన పలు ప్రాంతాలను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, మేయర్ గుండు సుధారాణి, గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు క్షేత్ర స్థాయిలో పర్యటించి చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. భద్రకాళి బండ్ వెనక నీటి ప్రవాహ తీరును వారు పరిశీలించారు. పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్న వరద బాధితులను వారు పరామర్శించారు. వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. చిన్నపాటి వర్షానికే గ్రేటర్ పరిధిలోని అనేక కాలనీలు, ప్రాంతాలు నీట మునగడానికి గల కారణాలపై ఆరా తీశారు. గత కొన్ని సంవత్సరాలుగా ముంపు సమస్య నగర ప్రజలకు తలనొప్పిగా మారినా శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడకపోవడానికి గల కారణాలపై అధ్యయనం చేశారు. అయితే గతంలో మాదిరిగా సమస్య వచ్చినప్పుడు తాత్కాలిక పరిష్కారంకోసం వెతకడం కాకుండా నగరాన్ని ముంపు రహిత పట్టణంగా మార్చేందుకు చేపట్టాల్సిన చర్యలపై పూర్తి అధ్యయనం చేస్తున్నారు. – వరంగల్ వాయిస్ ప్రతినిధి




### అటవీ అధికారులపై
## సీసీఎఫ్ఓ సీరియస్

- చర్యలకు ఆదేశం
- వరంగల్ వాయిస్ కథనం పై స్పందన

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం అటవీ శాఖ భూమి అమ్మకం పేరిట ఆగస్ట్ 13న వరంగల్ వాయిస్ పత్రికలో వచ్చిన కథనంపై జయశంకర్ భూపాలపల్లి సీసీఎఫ్ఓ ప్రభాకర్ సీరియస్ అయినట్లు సమాచారం. విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. గురువారం డీఎఫ్ఓ, అటవీ శాఖ అధికారుల బృందం క్షేత్ర స్థాయిలో పర్యటించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వారు అటవీ శాఖ భూమి అమ్మకంపై విచారణ చేపట్టనున్నారు. – వరంగల్ వాయిస్, మహాదేవపూర్

8లో..



## ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఇబ్బందులు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్

వరంగల్ వాయిస్ Evening Daily

GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

బుధవారం, ఆగస్టు 13, 2025

# ముంపు కారణాలపై.. అన్వేషణ



- శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు
- క్షేత్రస్థాయిలో పర్యటించిన అధికారులు
- భద్రకాళి బండ్ వెనక నీటి ప్రవాహ తీరు పరిశీలన
- అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ పిలుపు

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** భారీ వర్షాల నేపథ్యంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, నగర మేయర్ గుండు సుధారాణి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. భద్రకాళి బండ్ వెనక వైపు నీటి ప్రవాహ తీరుపై ఆరా తీశారు. బల్దియా పరిధి 14 వ డివిజన్ బాలాజీ నగర్ 100 ఫీట్ల రోడ్, చింతల్ మైసమ్మ గుడి వద్ద డ్రైన్ వాటర్ పనులను పరిశీలించి సమర్థవంతంగా చేపట్టుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు పోతన రోడ్ లోని మర్వాడి భవన్ లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్న వరద బాధితులను పరామర్శించారు. వారికి అందుతున్న భోజన వసతులపై ఆరా తీశారు. సమయానికి భోజనం అందుతుందా అంటూ అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం అకాల వర్షానికి ఇళ్లలోకి చేరిన నీటితో సర్వం కోల్పోయిన కుటుంబాలను వారు పరామర్శించారు. నీరు నిలువ ఉన్న ప్రాంతాల్లో జేసీబీలతో తక్షణమే కచ్చా నాలాలు తీసి వరద నీరు వెళ్లేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

శాశ్వత చర్యలు..

వరంగల్ మండలంలోని ఎన్టీఆర్ నగర్, సంతోషిమాత కాలనీ, బృందావన్ కాలనీలు చిన్నపాటి వర్షానికే ప్రతి ఏట మునిగిపోవడానికి గల కారణాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఇరిగేషన్, కాకతీయ పట్టణాభి సంస్థ, బల్దియా అధికారులతో కలసి కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ముంపు నుంచి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. భద్రకాళి వెనుక భాగంలో 2018 లో నిర్మించిన రిటైనింగ్ వాల్, కన్వెన్షన్ వద్ద గల భద్రకాళి కట్టను ఈ సందర్భంగా వారు పరిశీలించారు. దీనిని బలోపేతం చేయుటకు చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. 14వ డివిజన్ లోని ఎస్సార్ నగర్, సాయి గణేష్ కాలనీలలోని వరద నీరు సాఫీగా వెళ్లకపోవడానికి గల కారణాలు తెలుసుకున్నారు. వెంటనే రోడ్డుకు ఇరువైపుల ఉన్న అనధికారిక ఆక్రమణలను తొలగించాలని బల్దియా అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

### పునరావాస కేంద్రాల ఏర్పాటు..

గ్రేటర్ వరంగల్ కమిషనర్ మాట్లాడుతూ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ నగరంలో ముంపు నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. వరంగల్ నగరంలోని సుమారు 30కి పైగా ముంపునకు గురైన ప్రాంతాలు నిర్వాసితుల కోసం ముందస్తుగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పునరావాస కేంద్రాల్లో వారికి శుభ్రమైన తాగు నీరు, ఆహారం, దుప్పట్లు అందజేస్తున్నామన్నారు. ప్రస్తుతం పరిస్థితి నియంత్రణలో ఉందన్నారు. ముంపు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నట్లు వెల్లడించారు.

### అధైర్య పడొద్దు..

వరద ముంపు ప్రాంతాల్లో కలెక్టర్, కమిషనర్ లతో కలిసి పర్యటించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ రానున్న 72 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అధైర్య పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని సూచించారు. వారికి ఆహారంతో పాటు మెడిసిన్ కూడా ఉచితంగా అందజేస్తున్నామన్నారు. అలాగే కచ్చా నాలా తీస్తున్న ప్రాంతాలను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. నాలాలు ఎవరైనా కబ్జా చేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రూ.158 కోట్లతో ముంపు రహిత నగరంగా తీర్చి దిద్దేందుకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యా రాణి, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ తూర్పాటి సులోచన-సారయ్య, బల్దియా ఎస్ఈ మహేందర్, ఈఈ సంతోష్ బాబు, తహసీల్దార్ ఇక్బాల్, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.







## కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయండి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- కేంద్ర పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి సంజయ్ కుమార్ కు వినతి

**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కేంద్రీయ విద్యాలయంతో పాటు జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కోరారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో కేంద్ర పాఠశాల విద్య శాఖ కార్యదర్శి సంజయ్ కుమార్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. భూపాలపల్లి జిల్లాలో సింగరేణి ఉద్యోగులు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగ ఉద్యోగులు, ఐటీ ఉద్యోగులు ఎక్కువగా ఉంటారని, వారి పిల్లలకు నాణ్యమైన విద్య అవసరమని ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. కేంద్రీయ విద్యాలయం వస్తే స్థానిక పిల్లలకు మంచి విద్య అందుతుందన్నారు. ఉద్యోగుల బదిలీల కారణంగా చదువులో అంతరాయం లేకుండా ఉంటుందని ఎంపీ పేర్కొన్నారు. అలాగే జయశంకర్ భూపాలపల్లిలో నవోదయ పాఠశాల ఏర్పాటు చేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. భూపాలపల్లి జిల్లా గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడి ఉందని, జిల్లాలో ఇప్పటివరకు నవోదయ పాఠశాల లేకపోవడంతో ప్రతిభావంతులైన పిల్లలు మంచి రెసిడెన్షియల్ విద్యకు దూరమవుతున్నారని ఎంపీ డాక్టర్ కడియం కావ్య విద్యాశాఖ కార్యదర్శి సంజయ్ కుమార్ కు వివరించారు. జిల్లాలో నవోదయ పాఠశాల వస్తే గ్రామీణ పిల్లలకు మంచి అవకాశాలు లభిస్తాయని, జిల్లాలో కేంద్రీయ విద్యాలయం, జవహర్ నవోదయ విద్యాలయం కోసం అవసరమైన స్థలం సదుపాయాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదం తెలపాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి పట్ల సానుకూలంగా స్పందించిన విద్యాశాఖ కార్యదర్శి సంజయ్ కుమార్ కేంద్రీయ విద్యాలయం, జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు.




## 17 నుంచి కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాలు

- ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో సమీక్ష
- హాజరైన కమిషనర్, మేయర్, అదనపు కలెక్టర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాల ఏర్పాట్లపై బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో సమీక్షా సమావేశం నిర్వహించారు. మేయర్ గుండు సుధారాణి, గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఇతర అధికారులతో కలిసి దర్గా పీఠాధిపతి ఖుస్రూ పాషా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు మేయర్ గుండు సుధారాణి తెలిపారు. గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ రోడ్ల మరమ్మతులు, విద్యుత్ దీపాల అలంకరణ, జనరేటర్ల ఏర్పాటుతో పాటు తాగునీటి సౌకర్యం, పారిశుధ్య నిర్వహణ వంటి ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ వివిధ శాఖల సమన్వయంతో ఉత్సవాల ఏర్పాట్లు, నిర్వహణను పర్యవేక్షిస్తామని తెలిపారు. ఏసీపీ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌వో వైవీ గణేష్, ఆర్డీవో రాథోడ్ రమేష్, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ గౌస్ హైదర్, కాజీపేట డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బీజేపీ అంగ సంస్థగా కేంద్ర ఎన్నికల కమిషన్

◆ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి
◆ మహాసభలను జయప్రదం చేయాలని బైక్ ర్యాలీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** కేంద్ర ఎన్నికల కమిషన్ బీజేపీ అంగ సంస్థగా వ్యవహరిస్తోందని, దొంగ ఓట్లతోనే కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర 4వ మహాసభల జయప్రదం కోసం హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. వెయ్యి స్తంభాల గుడి నుండి ఆర్ట్స్ కాలేజీ వరకు చేపట్టిన ఈ ర్యాలీని తక్కళ్లపల్లి శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా నుండి ఓటర్లను తొలగించడం, కొత్త ఓటర్లను సృష్టించడం ద్వారా బీజేపీ అధికారంలోకి వచ్చిందని, ఇది ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమని అన్నారు. మతం, కులం పేరుతో ప్రజలను విడదీస్తూ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద, ఫాసిస్టు విధానాలను ఎండగట్టడంలో కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. సీపీఐకి వందేళ్ల వీరోచిత పోరాట చరిత్ర ఉందని, దేశ స్వాతంత్ర్య పోరాటంలో వేలాదిమంది బలిదానం చేశారని ఆయన గుర్తు చేశారు. మేడ్చల్ జిల్లాలోని గాజుల రామారంలో ఈ నెల 20 నుంచి 22 వరకు మూడు రోజుల పాటు జరిగే సీపీఐ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ బైక్ ర్యాలీలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, ఎన్.ఏ.స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, ఇతర జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

**అధికారులకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆదేశాలు**



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** రాష్ట్రవ్యాప్తంగా రానున్న మూడు రోజుల పాటు (72 గంటలు) భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో, పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. ప్రజల భద్రత కోసం ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల ఉన్నతాధికారులు, వివిధ శాఖల (రెవెన్యూ, పంచాయతీ రాజ్, విద్యుత్, పబ్లిక్ హెల్త్, అగ్నిమాపక, పోలీసు) అధికారులతో ఆమె ఫోన్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వర్షాల సమయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ విధులకు హాజరై పరిస్థితిని పర్యవేక్షించాలని ఆమె సూచించారు. గ్రామస్థాయి అధికారులు తమతమ ప్రాంతాల్లోనే ఉండి అత్యవసర సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప దూర ప్రయాణాలు వాయిదా వేసుకోవాలి. వరద ముంపు ప్రాంతాలు, నీటి ప్రవాహాలు దాటకుండా జాగ్రత్తలు పాటించాలి. చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు వర్ష సమయంలో బయట తిరగకుండా ఇంట్లోనే ఉండాలి. ఎవరైనా ఇబ్బందుల్లో ఉంటే స్థానిక నాయకులు లేదా అధికారులను సంప్రదించాలి. నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండి సహాయం అందించాలి. ప్రజలందరూ జాగ్రత్తలు పాటించాలని కోరిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, తాము ఎల్లప్పుడూ ప్రజల పక్షాన ఉంటామని హామీ ఇచ్చారు.

# కూలిన ఇళ్లకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలి

**కార్పొరేటర్ మరుపల్ల రవి**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారీ వర్షాల కారణంగా కూలిపోయిన ఇళ్లకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి డిమాండ్ చేశారు. డివిజన్‌లోని కరీమాబాద్ రామస్వామి గుడి ప్రాంతంలో నివాసం ఉంటున్న ఏ బారే నాగమణి, శంకర్ దంపతుల ఇల్లు ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయింది. కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని చాలామంది నిరుపేదలు ఆర్థిక స్తోమత లేక పాత ఇళ్లలోనే జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. అటువంటి వారికి ప్రభుత్వం వెంటనే ఇందిరమ్మ ఇళ్ల పథకం మంజూరు చేయాలని కోరారు. పాత ఇళ్లలో నివసిస్తున్న ప్రజలు తమ ప్రాణాలను కాపాడుకోవడానికి సురక్షితమైన ప్రదేశాలకు వెళ్లాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వెంట నాయకులు రాముల బాబు, సంతోష్, సతీష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిరసన




**వరంగల్ వాయిస్, వరంగల్ :** అమెరికా సామ్రాజ్యవాదం నుంచి దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ, అఖిల భారత రైతు, కార్మిక సంఘాల పిలుపు మేరకు వరంగల్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎస్కేఎం జిల్లా అధ్యక్షుడు రాచర్ల బాలరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. కార్మిక, రైతు సంఘాల నాయకులు గన్నార రమేష్, ముక్కెర రామస్వామి, సోమిరెడ్డి శ్రీనివాస్, ఈసంపల్లి బాబు, అక్కనపల్లి యాదగిరి మాట్లాడుతూ ట్రంప్ భారతదేశంపై పెత్తనం చెలాయిస్తూ, దేశ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. వ్యాపార లాభాల కోసం భారతదేశంపై 50శాతం సుంకాలు విధించడం దేశ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రధాని నరేంద్ర మోడీ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ట్రంప్‌తో స్నేహం కొనసాగించిన మోడీ, దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పాకిస్తాన్‌తో మైత్రిని కొనసాగిస్తూ, భారతదేశంపై శత్రుత్వాన్ని పెంచేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారని, తన ఆయుధాలను అమ్ముకోవడం కోసమే పేద దేశాలపై పెత్తనం చలాయిస్తున్నారని విమర్శించారు. గడిచిన పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని, ప్రజల వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని నాయకులు మండిపడ్డారు. దేశ ఖనిజ సంపద, సహజ వనరులు, ప్రభుత్వ రంగ సంస్థలను విదేశీ పెట్టుబడిదారులకు, కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. నిరుద్యోగం, పేదరికం, ధరల పెరుగుదల ప్రజల జీవనాన్ని దుర్భరం చేస్తున్నాయని, 50శాతం సుంకాల వల్ల దేశంలో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మత విద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజల హక్కుల కోసం పోరాడే కార్మిక వర్గాన్ని అణచివేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్మికులను బానిసత్వంలోకి నెట్టేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. అమెరికా పెత్తనాన్ని తిప్పికొట్టాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసనలో నర్రా ప్రతాప్, వీరగోని శంకరయ్య, చిర్రా సూరి, తిరుపతి, కోరబోయిన కుమార స్వామి, మాలోత్ సాగర్, ఎండీ యాకూబ్, బొట్ల శ్రీనివాస్, సుంకా మొగిలి, ఎండీ మెహబూబ్ పాషా, మల్లికార్జున్, ఓదేల్ రత్నం పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శీలం వెంకన్న కుమారుడి వివాహ వేడుకకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు మండల పార్టీ అధ్యక్షులు పసుమర్తి సీతారాములు, మాజీ జడ్పీటీసీ మంగళపెల్లి శ్రీనివాస్, తొర్రూరు బీఆర్ఎస్ ఎన్నికల ఇంఛార్జి శ్రీరామ్ సుధీర్, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, సీనియర్ నాయకులు కాలు నాయక్, తూర్పాటి రవి, శీలం లింగన్న గౌడ్, బొల్లగాని శ్రీను గౌడ్, రాంబాబు, బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు యర్రం రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభం



**వరంగల్ వాయిస్, కమలాపూర్:** మండలంలోని చేనేత కార్మికులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతంగా కొనసాగుతోందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్ తెలిపారు. బుధవారం కమలాపూర్ మండల కేంద్రంలో చేనేత కార్మికులకు కేటాయించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ముగ్గులు పోసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, ప్రభుత్వ అధికారులు లబ్ధిదారులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు పెరుమాండ్ల పరుశరాములు, మాజీ సర్పంచ్ చేరాల చంద్రకళ, మాజీ ఉప సర్పంచ్ మౌటం రమేష్ పాల్గొన్నారు.

# మహిళా సాధికారత సైకిల్ యాత్ర

**బానోత్ వెన్నెలకు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మద్దతు**



**వరంగల్ వాయిస్, ములుగు:** మహిళా సాధికారతను ప్రోత్సహించే లక్ష్యంతో కామారెడ్డికి చెందిన విద్యార్థిని బానోత్ వెన్నెల చేపట్టిన సైకిల్ యాత్ర అభినందనీయమని ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్ అన్నారు. బుధవారం ములుగు జిల్లా కేంద్రానికి చేరుకున్న వెన్నెలకు ఆయన ఘనంగా స్వాగతం పలికి, సత్కరించారు. ఈ సందర్భంగా బాదం ప్రవీణ్ మాట్లాడుతూ డిగ్రీ చదువుతున్న వెన్నెల మహిళా సాధికారత కోసం సైకిల్ యాత్ర చేపట్టడం గర్వించదగిన విషయమని ప్రశంసించారు. ఆమె యాత్ర ముఖ్యంగా మహిళలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. వెన్నెల యాత్ర ఖర్చుల నిమిత్తం బాదం ప్రవీణ్ రూ.1000 ఆర్థిక సహాయం అందజేశారు.

# విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

## డీఐఈఓ డాక్టర్ శ్రీధర్ సుమన్




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** విద్యార్థులు మత్తు పదార్థాలకు, ఇతర వ్యసనాలకు దూరంగా ఉండాలని వరంగల్ జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీఐఈఓ) డాక్టర్ శ్రీధర్ సుమన్ అన్నారు. స్థానిక ఏవీవీ మాల్ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 'నషా ముక్త్ భారత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణ, పట్టుదలతో వాటిని సాధించి ఉన్నత పౌరులుగా ఎదగాలని ఆయన సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ భూజేందర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి కోడిమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏవీవీ కళాశాల విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుంటారని, ముఖ్యంగా సమాజ రుగ్మతలపై ప్రజలకు చైతన్యం కల్పిస్తారని తెలిపారు. 'నషా ముక్త్ భారత్' కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, మత్తు పదార్థాల అనర్థాలను ప్రజలకు తెలియజేస్తామని, ఎవరైనా మత్తు పదార్థాలను విక్రయించినా, సేవించినా స్థానిక అధికారులకు సమాచారం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం డ్రగ్ వ్యతిరేక పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎస్.అనిత, సంజీవ, డాక్టర్ శ్రీధర్, సప్న, డాక్టర్ బి.గోపి, విద్యార్థులు సన, సహిస్తా, దేవిశ్రీప్రసాద్, సాకేత్, నవ్య, రాజకుమార్, చిరంజీవి, దస్తగిరి, సాత్విక్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి

## పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, సంగెం:** నిరంతరంగా కురుస్తున్న వర్షాల కారణంగా సంగెం మండలం కాట్రపల్లి, వెంకటాపూర్ గ్రామాల మధ్య ఉన్న వంతెన వాగులో కొట్టుకుపోయింది. దీనిపై పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణమే తాత్కాలిక రహదారిని నిర్మించాలని, శాశ్వత వంతెన నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. వర్షాలు తగ్గే వరకు ప్రజలు అధికారుల సూచనలు పాటించాలని, వర్షపునీటి ప్రవాహాల్లో వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి హైదరాబాద్‌లోని నాగోల్ దేవకి కన్వెన్షన్‌లో జరిగిన తన సమీప బంధువుల వివాహ వేడుకలో పాల్గొన్నారు. కేశవ్ రెడ్డి, సోనిల వివాహ మహోత్సవానికి హాజరైన ఆమె, నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

# అవయవ దానంపై అవగాహన ర్యాలీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రపంచ అవయవ దాన దినోత్సవం సందర్భంగా, తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ ప్రతినిధులు హనుమకొండలోని బాలసముద్రం నుంచి ఏకశిలా పార్కు వరకు అవయవ దాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏకశిలా పార్కులో సమావేశం ఏర్పాటు చేసి, అవయవ దానం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ నేత్ర, శరీర, అవయవ దానంపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. భారతదేశంలో అవయవాల లభ్యత తక్కువగా ఉండటం వల్ల ప్రతి సంవత్సరం ఐదు లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో 10 లక్షల మందికి కేవలం 0.65 మంది దాతలు మాత్రమే లభిస్తున్నారని, పాశ్చాత్య దేశాలైన స్పెయిన్, క్రొయేసియాలో ఈ సంఖ్య 30కి పైగా ఉందని వివరించారు. కాబట్టి, ప్రజలందరూ అవయవ దానంపై అవగాహన పెంచుకుని, బ్రెయిన్ డెడ్ అయిన సందర్భంలో అవయవ దానం చేయడానికి ముందుకు రావాలని కోరారు. ఒక దాత నుండి లభించే అవయవాలతో ఎనిమిది మందికి ప్రాణదానం చేయవచ్చని తెలిపారు.

# మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఎంతో ఉపయోగం

## పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**వరంగల్ వాయిస్, పరకాల:** సంగెం మండలం షాపూర్, లోహిత, రామచంద్రపురం గ్రామాల మీదుగా పునరుద్ధరించబడిన కొత్త ఆర్టీసీ బస్సు సర్వీసులను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రిబ్బన్ కట్ చేసి, బస్సును స్వయంగా నడిపి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాలలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం విజయవంతంగా కొనసాగుతోందని అన్నారు. 2023 డిసెంబర్ 9 నుంచి అమల్లోకి వచ్చిన ఈ పథకం ద్వారా మహిళలు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణిస్తున్నారని తెలిపారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో మాత్రమే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అందిస్తున్నారని, త్వరలో ఇతర రాష్ట్రాల్లో కూడా ఈ పథకాన్ని అమలు చేయబోతున్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 200 కోట్ల టికెట్లపై ఉచిత బస్సు ప్రయాణాల ద్వారా ఆర్టీసీకి రూ. 6 వేల కోట్ల లాభం వచ్చిందని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరచడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. కొత్త బస్సుల వల్ల ప్రజలకు సమయానికి, సౌకర్యవంతంగా ప్రయాణం చేసే అవకాశం లభిస్తుందని తెలిపారు. భవిష్యత్తులో నియోజకవర్గంలోని మరిన్ని గ్రామాలకు రవాణా సౌకర్యాలను అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.




# తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసి, రూ. 10 వేల కోట్లు కేటాయించాలని ఉద్యమకారుల ఫోరం జిల్లా నాయకులు నర్రా సంపత్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరారు. ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినా ఉద్యమకారుల గురించి పట్టించుకోకపోవడం విడ్డూరమని అన్నారు. ఇటీవల వరంగల్‌లో చేపట్టిన పాదయాత్రకు విశేష స్పందన లభించినప్పటికీ, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉద్యమకారులను ఆదుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమకారులను ఏకం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కన్నారపు పరుశరాములు, గొల్లపల్లి శ్రీనివాస్, మేకల మురళి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## సీఐ సంతోష్ కుమార్



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** బంగాళాఖాతంలో ఉపరితల ద్రోణి ప్రభావంతో విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు సీఐ సంతోష్ కుమార్ సూచించారు. మంగళవారం రాత్రి ఆత్మకూరు మండలం కటాక్షపూర్‌లోని లెవల్ వంతెనను ఆయన తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, వర్షాల వల్ల వాగులు, వంకలు పొంగిపొర్లే అవకాశం ఉందని, ప్రజలు, వాహనదారులు జాగ్రత్తగా ఉండాలని కోరారు. కటాక్షపూర్ చెరువు మత్తడి పడినట్లయితే వాహనదారులు అప్రమత్తంగా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాలలో వాగులు, వంతల వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులపాటు వర్ష హెచ్చరికలు ఉన్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# శాంకరి ఇంటీరియర్స్, డెకరేటర్స్ షోరూమ్ ప్రారంభం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ హంటర్ రోడ్డులో పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు పట్టణానికి చెందిన సర్వీ వెంకన్నఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శాంకరి ఇంటీరియర్స్ అండ్ డెకరేటర్స్ నూతన షోరూమ్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి, హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం నిర్వహించారు. అనంతరం షోరూమ్‌ను సందర్శించి అందుబాటులో ఉన్న ఇంటీరియర్ డిజైన్స్, డెకరేషన్ ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, "ప్రాంత ప్రజలకు గృహాల అందాన్ని పెంచే నాణ్యమైన సేవలు, ఆధునిక డిజైన్లను అందించడంలో ఈ షోరూమ్ ఆదర్శంగా నిలుస్తుందని ఆశిస్తున్నాం" అని పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో తొర్రురు పట్టణ మరియు మండల నాయకులు, వ్యాపారవేత్తలు, స్నేహితులు, బంధువులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

## కుందూరు వెంకటేశ్వర రెడ్డికి పరామర్శ ..

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండలోని తన నివాసంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర రెడ్డిని టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి పరామర్శించారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో ఆయన గాయపడిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వారు ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు, కొడకండ్ల మండల అధ్యక్షులు, తొర్రురు మండల, పట్టణ అధ్యక్షులు, నాయకులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.



# కనీస వేతనాల జీవోలు విడుదల చేయాలి

◆ సీఐటీయూ నాయకుల డిమాండ్
◆ కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** షెడ్యూల్డ్ పరిశ్రమల ఐదు ప్రిలిమినరీ జీవోలను వెంటనే గెజిట్ చేయాలని, మిగిలిన 68 జీవోలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కనీస వేతనాల జీవోలను వెంటనే విడుదల చేయాలని నినాదాలు చేస్తూ అరగంట పాటు ఆందోళన చేశారు. అనంతరం హనుమకొండ డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ కనీస వేతనాల సవరణకు సుప్రీంకోర్టు తీర్పులను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాల సలహా మండలి ప్రతిపాదనలు పక్కన పెట్టి కేబినెట్ సబ్ కమిటీ చేస్తున్న కాలయాపనను నిలిపివేయాలని కోరారు. గత పదేళ్లలో నాలుగు కనీస వేతనాల సలహా మండళ్లను ఏర్పాటు చేసినప్పటికీ, 2021లో జారీ చేసిన ఐదు జీవోలను గెజిట్ చేయకుండా పెండింగ్‌లో ఉంచారని విమర్శించారు. షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు జీవోలను గెజిట్ చేయకపోవడం వల్ల ప్రతి నెల రూ. 6 వేల కోట్ల శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తన కార్మిక వ్యతిరేక చర్యలను విడనాడి, వెంటనే కనీస వేతనాలు పెంచాలని రాగుల రమేష్ డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు టి.ఉప్పలయ్య, జిల్లా నాయకులు ఆలకుంట యాకయ్య, యాస బాబు, దాసరి సమ్మయ్య, గోల్కొండ ఏసు, మౌనిక, శ్యామ్, మనోహర్, తిరుపతితో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

# ‘హర్ ఘర్ తిరంగా’ బైక్ ర్యాలీ



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వాల పిలుపు మేరకు రఘునాథపల్లి మండల కేంద్రంలో బుధవారం ‘హర్ ఘర్ తిరంగా’ బైక్ ర్యాలీ నిర్వహించారు. మండల అధ్యక్షులు పుప్పాల వేణుకుమార్ అధ్యక్షతన, భారతీయ జనతా యువ మోర్చా మండల అధ్యక్షులు బోల్ల రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా నాయకులు కల్నల్ డా. భిక్షపతి మాట్లాడుతూ ప్రతి ఒక్క భారతీయుడు తమ ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో సీనియర్ నాయకులు కల్పగూరి ప్రభాకర్, మర్కాల వెంకట్ రెడ్డి, వల్లాల ఉపేందర్, యామంకి కొమురెల్లి, వల్లపు తిరుమల్ ప్రసాద్, కట్ల సదానందం, లెక్కల దామోదర్ రెడ్డి, ద్యావర రాజు, మల్కపురం శ్రీకాంత్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు ఉడుత రంజిత్ యాదవ్, తుమ్మలపల్లి సోమేశ్వర్, మండల ఉపాధ్యక్షులు వాసుదేవర్ రెడ్డి, గాదె ఉపేందర్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి బోల్ల అఖిల్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు తోట మహేష్, కట్ట రాజేష్, బూత్ అధ్యక్షులు, యువ మోర్చా కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ

**వరంగల్ వాయిస్, చిట్యాల :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చిట్యాలలో బుధవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మండల విద్యాధికారి కోడెపాక రఘుపతి, ఇంఛార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీరామ్ రఘుపతి సమక్షంలో ఏఎస్ఐ మధుసూదన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మధుసూదన్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు మానవ మనుగడకు పెనుముప్పు అని పేర్కొన్నారు. మండల విద్యాధికారి రఘుపతి మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని, యువత శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. మాదకద్రవ్యాలను అందరం కలిసికట్టుగా నిర్మూలిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బొమ్మ రాజమౌళి, రామ్ నారాయణ, శ్రీనివాస్, ఉస్మాన్ అలీ, శంకర్, బుర్ర సదయ్య, సరళ దేవి, నీలిమారెడ్డి, విజయలక్ష్మి, మౌనిక, స్వామి, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సూదం సాంబమూర్తి, పూర్వ విద్యార్థి గుర్రపుచందర్ తదితరులు పాల్గొన్నారు.



# గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీడీవో



**వరంగల్ వాయిస్, దామెర:** పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దామెర ఎంపీడీవో గుమ్మడి కల్పన సూచించారు. బుధవారం ఓగులాపూర్ ఎస్‌బీఐటీ ప్రాంగణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వంటగది, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. క్రీడా మైదానంలో నీరు నిలిచి ఉన్న చోట దోమలు పెరగకుండా గ్రామపంచాయతీ సిబ్బందితో ఆయిల్ బాల్స్ వేయించారు. విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు రుచికరమైన భోజనం, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమ్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ డేవిడ్, గ్రామపంచాయతీ కార్యదర్శి ఇంజపెల్లి నరేష్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పలువురికి జైలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 17 మందికి కోర్టు శిక్షలు విధించింది. పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, అదనపు డీసీపీ ఆర్. ప్రభాకర్ రావు, ఏసీపీ టి. సత్యనారాయణ పర్యవేక్షణలో చేపట్టిన తనిఖీల్లో పట్టుబడిన వారిని మేజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేశం ఎదుట హాజరుపరిచారు. గీసుగొండ మండలం, ఎలుకుర్తి హవేలికి చెందిన రాయపురి శ్రీకాంత్‌కు రెండు రోజుల జైలు శిక్ష విధించారు. అతడిని హుజూరాబాద్ సబ్ జైలుకు పంపారు. మిగిలిన 16 మందికి రూ. 20,800 జరిమానా విధించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ఐదుగురిని కూడా కోర్టులో హాజరుపరిచారు. ఒంగోలుకు చెందిన చపలి రాంబాబుకు రెండు రోజుల జైలు శిక్ష పడింది. అతడిని హుజూరాబాద్ సబ్ జైలుకు పంపారు. మిగిలిన నలుగురికి రూ. 3,000 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కె. సుజాత ఒక ప్రకటనలో తెలిపారు.

# సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై అవగాహన



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని శ్రీహర్ష స్కూల్‌లో విద్యార్థులకు సైబర్ క్రైమ్, డ్రగ్స్, రోడ్డు ప్రమాదాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. దామెర ఎస్సై కొంక అశోక్ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు విలువైన సూచనలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ యువత తమ జీవితాలను నాశనం చేసుకోకుండా గుట్కా, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మూఢనమ్మకాలను నమ్మవద్దని, సీసీ కెమెరాల ఉపయోగాలు, డయల్ 100 సేవలను వినియోగించుకోవడంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎలాంటి చెడు అలవాట్లకు బానిసలు కాకుండా, బాగా చదువుకుని మంచి ఉద్యోగాలు సంపాదించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎస్సై కోరారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కొంక అశోక్, శ్రీహర్ష స్కూల్ ప్రిన్సిపాల్, సిబ్బంది, దామెర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

◆ అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం దామెర మండలం ఓగ్లాపూర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులం, మైనారిటీ, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంతకు ముందు దామెర మండలంలోని రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించారు. రెవెన్యూ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి, కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. భూభారతి గ్రామసభలలో రైతుల నుండి వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యాలయ సిబ్బంది పనితీరు, హాజరు పట్టికను కూడా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టోర్ రూమ్‌లను సందర్శించి కూరగాయలు, ఇతర వంట సామాగ్రిని పరిశీలించారు. విద్యార్థులకు వండిన భోజనాన్ని రుచి చూసి, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని ఉపాధ్యాయులు, వంట నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. గురుకుల హాస్టల్స్‌లో పరిశుభ్రత పాటించాలని, విద్యార్థులకు శుద్ధి చేసిన తాగునీటిని అందించాలని అదనపు కలెక్టర్ సూచించారు. తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర వస్తువులనే వంటల్లో ఉపయోగించాలని చెప్పారు. వర్షాకాలం నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో మత్తు పదార్థాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# బీసీ యువజన సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పాండవుల సురేందర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** వడ్డేపల్లికి చెందిన పాండవుల సురేందర్ ముదిరాజ్ బీసీ యువజన సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వద్దకొండ వేణుగోపాల్ గౌడ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ, గత 10 సంవత్సరాలుగా తాను ముదిరాజ్, ఇతర బీసీ కులాల ఐక్యత కోసం చేస్తున్న కృషిని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినందుకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షులు బైరి రవికృష్ణ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు దాడి మల్లయ్య యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో బీసీ కులాల ఐక్యత కోసం కృషి చేస్తానని, ఎక్కువ సంఖ్యలో సీట్లు సాధించేలా ప్రయత్నిస్తానని ఆయన పేర్కొన్నారు.

# గణపూర్‌లో కొత్త సీఐ సర్కిల్ ఆఫీస్ ప్రారంభోత్సవం



**వరంగల్ వాయిస్, గణపురం:** భూపాలపల్లి జిల్లా గణపురం పోలీస్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సీఐ సర్కిల్ ఆఫీస్ ప్రారంభోత్సవం గురువారం ఉదయం 10:45 గంటలకు జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గండ్ర సత్యనారాయణ రావు గారు విచ్చేయనున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు, మహిళా నాయకులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ నాయకులు, పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్ కోరారు.

# రైతు బీమా దరఖాస్తు గడువు పొడిగించాలి



**వరంగల్ వాయిస్, నడికూడ:** రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తున్న రైతు బీమా పథకానికి దరఖాస్తు గడువు తేదీని పొడిగించాలని బీఆర్ఎస్ ముస్త్యాలపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు మేకమల్ల వెంకటేష్ కోరారు. ప్రభుత్వం ఇచ్చిన గడువు ఈరోజుతో ముగుస్తున్నందున, వరుస సెలవులు, భారీ వర్షాల కారణంగా రైతులకు గడువు సరిపోవడం లేదని ఆయన అన్నారు. నూతనంగా పట్టాలు పొందిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసేందుకు, దరఖాస్తు గడువును పొడిగించాలని ఆయన ప్రభుత్వాన్ని, అధికారులను విజ్ఞప్తి చేశారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన బీఆర్ఎస్ నేతలు



**వరంగల్ వాయిస్, పరకాల:** పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సోదరుడు చల్లా రఘుపతి రెడ్డి, అనిత దంపతుల కుమార్తె మన్వీత రెడ్డి వివాహం చందన్ రెడ్డితో హైదరాబాద్‌లోని నిధి కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. ఈ వివాహ వేడుకకు బీఆర్ఎస్ జిల్లా నాయకులు నేతానీ శ్రీనివాస్ రెడ్డి, నడికూడ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దురిశెట్టి చంద్రమౌళి (చందు), ప్రధాన కార్యదర్శి నందికొండ గణపతి రెడ్డి, పరకాల మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చింతిరెడ్డి మధుసూదన్ రెడ్డి, పరకాల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి, పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి సారంగపాణి, బీఆర్ఎస్ నాయకులు మునిగాల సురేందర్ రావు తదితరులు హాజరయ్యారు. వారు నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

# కమలాపూర్‌లో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ



**వరంగల్ వాయిస్, కమలాపూర్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డ్రగ్స్ రహిత సమాజ స్థాపనలో భాగంగా, కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో మాదకద్రవ్యాల నిరోధ ప్రతిజ్ఞ నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్ దాదాపు 40 మంది హమాలీ కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఝాన్సీరాణి మాట్లాడుతూ, ఎట్టి పరిస్థితుల్లోనూ మాదకద్రవ్యాలకు బానిసలు కావద్దని సూచించారు. ఎక్కడైనా డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేసి సమాజాన్ని కాపాడాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మికులతో పాటు మార్కెట్ కార్యదర్శి జన్ను యాకయ్య, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

# పసరగొండ అవస్థలు




- పేరుకు పోయిన సమస్యలు
- నిరుపయోగంగా డంపింగ్ యార్డు, క్రీడా ప్రాంగణం
- డంపింగ్ యార్డ్ దగ్గరే చెత్తను కాల్చుతున్న వైనం
- రోడ్ల మీదకు వస్తున్న మురుగు నీరు
- గడ్డితో దర్శనం ఇస్తున్న నర్సరీ
- పట్టించుకొని అధికారులు

**వరంగల్ వాయిస్, దామెర:** హనుమకొండ జిల్లా, దామెర మండలం పసరగొండ గ్రామం సమస్యలతో అస్తవ్యస్థంగా మారింది. దాదాపు




రూ. 2 లక్షల వ్యయంతో నిర్మించిన డంపింగ్ యార్డు నిరుపయోగంగా మారింది. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డు పక్కనే కాల్చివేయడం వల్ల పర్యావరణ కాలుష్యం పెరిగి, ప్రజలు శ్వాసకోశ సంబంధ వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.
గ్రామంలో మురుగు నీరు రోడ్లపైకి రావడం, రోడ్ల పక్కన చెత్త పేరుకుపోవడం, దోమల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీలోని నర్సరీ కోసం ప్రభుత్వం సంవత్సరానికి రూ. 2 లక్షలు ఖర్చు చేస్తున్నా, అక్కడ ఖాళీ బ్యాగులు, బ్యాగుల్లో గడ్డి మాత్రమే కనిపిస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం కూడా పశువుల మేతకు ఉపయోగపడుతోందని, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. కాబట్టి, సంబంధిత అధికారులు తక్షణమే పసరగొండ గ్రామ సమస్యలను పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



# వరంగల్‌ను తిరిగి ట్రై-సిటీగా తీర్చిదిద్దాలి

- ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** గత పాలకుల ద్వంద వైఖరి కారణంగా వరంగల్ నగరం అభివృద్ధిలో వెనుకబడిందని తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ఆరోపించారు. బుధవారం ఆత్మకూరులో విలేకరులతో మాట్లాడుతూ, 1300 సంవత్సరాల చరిత్ర కలిగిన కాకతీయ సామ్రాజ్య రాజధాని వరంగల్‌ను అశాస్త్రీయంగా రెండు జిల్లాలుగా విభజించడం వల్ల నగరాభివృద్ధి ఆగిపోయిందని అన్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఏకపక్ష నిర్ణయాల కారణంగా రాష్ట్ర అభివృద్ధి, ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం గత ప్రభుత్వాల తప్పులను సరిదిద్దాలని ఆయన కోరారు. ఉత్తర తెలంగాణకు తలమానికంగా ఉన్న వరంగల్ నగరాన్ని మళ్లీ అభివృద్ధి కేంద్రంగా మార్చాల్సిన బాధ్యత నేటి ఉమ్మడి జిల్లా నాయకత్వానిదేనని అన్నారు. గత పదేళ్ల పాలనలో వరంగల్ ఉమ్మడి జిల్లా సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ నగరాల కంటే వెనుకబడిందని విమర్శించారు. కాజీపేట రైల్వే జంక్షన్, వరంగల్ రైల్వే స్టేషన్, ఆర్ఈసీ, కేఎంసీ, కాకతీయ విశ్వవిద్యాలయం వంటి ఎన్నో విద్యాసంస్థలతో ఎదుగుతున్న వరంగల్ నగరాన్ని గత పాలకులు విచ్ఛిన్నం చేయడాన్ని జీర్ణించుకోలేని ఉత్తర తెలంగాణ ప్రజలు వారిని గద్దె దించారని గుర్తు చేశారు. వరంగల్, హనుమకొండ



జిల్లాలను కలిపి ఒకే జిల్లాగా ప్రకటించాలి. నగరాభివృద్ధి కోసం ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం, మాస్టర్ ప్లాన్ అమలు చేయాలి. కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌ను సంపూర్ణంగా అభివృద్ధి చేయాలి. ట్రై-సిటీ అంతటా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సిస్టమ్‌ను పూర్తి చేయాలి. మామునూర్ ఎయిర్‌పోర్టును నిర్మించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. హైదరాబాద్ చుట్టూ ఉన్న నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల సమన్వయంతో హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందిన విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన సూచించారు. స్వరాష్ట్రంలోనైనా రాష్ట్రం మొత్తం సమగ్ర అభివృద్ధి సాధించినప్పుడే ప్రజలు నమ్ముతారని అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర వేదిక కన్వీనర్ సోమ రామమూర్తి, ఉమ్మడి జిల్లా తెలంగాణ రైతు సంఘం అధ్యక్షులు సోమిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి

**వరంగల్ వాయిస్, పరకాల:** సీజనల్ వ్యాధుల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారి, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి (ఐఏఎస్) బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పరకాల ఏరియా ఆసుపత్రి, సిద్ధాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ), వంగపహాడ్ గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఏ. అప్పయ్య కూడా ఉన్నారు. పరకాల ఏరియా ఆసుపత్రిలో ఫీవర్ వార్డు, ఎన్సీడీ క్లినిక్, ఫార్మసీ విభాగాలను ఆయన తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యల గురించి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమ్ చౌహాన్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య ఆయనకు వివరించారు. డెంగ్యూ కేసు నమోదైన వంగపహాడ్ గ్రామంలోని ఇంటిని ఆయన పరిశీలించారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. వైద్య, మున్సిపల్, పంచాయతీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా పారిశుద్ధ్యం, డ్రై డే పాటించాలని సూచించారు. పాఠశాలలు, హాస్టళ్లలోని విద్యార్థులకు



ఫీవర్ సర్వే నిర్వహించి అవసరమైన వారికి పరీక్షలు చేయించాలని చెప్పారు. మందుల నిల్వలు సరిపడా ఉంచుకోవాలని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ర్యాపిడ్ టెస్టులు నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లాలో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్ ఆఫీసర్ల పర్యవేక్షణ జరుగుతోందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య తెలిపారు. మున్సిపల్, పంచాయతీ, వైద్యారోగ్య శాఖల అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహించడంతో పాటు క్షేత్ర స్థాయి తనిఖీలు కూడా చేపడుతున్నామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ నాగార్జున, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.మదన్మోహనరావు, డాక్టర్ శ్రీపాల్, ఇతర వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# నానితో మూడోసారి

- నాని, శేఖర్ కమ్ముల కాంబినేషన్ లో సాయిపల్లవి
- టాలీవుడ్‌లో తాజా చర్చ

టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులకి మంచి వినోదం పంచుతున్న విషయం తెలిసిందే. ఆయన తెరకెక్కించిన ప్రతి చిత్రం కూడా బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లే రాబట్టింది. ఇటీ–వల కుబేర అనే చిత్రంతో పలకరించాడు. ఈ మూవీ కూడా మంచి విజయం సాధించింది. ఇక ఇప్పుడు నానితో ఓ ప్రాజెక్ట్ చేయనున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. నేచురల్ స్టార్ నాని తన కెరీర్‌ను వైవిధ్యంగా మలుస్తున్నాడు. ప్రేమకథలతో, కుటుంబ డ్రామాలతో ప్రేక్షకుల మనసు దోచిన నాని, ఇటీవల 'హిట్ 3'లాంటి డార్క్ యాక్షన్ థ్రిల్లర్‌తో వైవిధ్యాన్ని చూపించాడు. ప్రస్తుతం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో 'ది ప్యారడైజ్' చిత్రం చేస్తున్నాడు. ఈ మూవీ తర్వాత శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఓ మూవీ చేయనున్నాడనే వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. ఇటీవలే 'కుబేర' మూవీతో మళ్లీ ఫామ్‌లోకి వచ్చిన శేఖర్ కమ్ముల, నానితో కలిసి ఎలాంటి కథను సినిమాగా తీయబోతున్నారా అనే ఆసక్తి పెరుగుతోంది. వీరిద్దరి కాంబినేషన్‌లో ఇది తొలి సినిమా కావడం, ఇద్దరికీ భిన్నమైన ఫాలోయింగ్ ఉండటంతో ఈ ప్రాజెక్ట్‌పై అప్పుడే హైప్ క్రియేట్ అయింది. ఈ మూవీలో హీరోయిన్‌గా సాయిపల్లవి పేరు వినిపిస్తుంది. ఇది నిజమైతే, ఇది నాని – సాయిపల్లవి జోడీకి మూడో సినిమా అవుతుంది. గతంలో వీరిద్దరూ కలిసి నటించిన 'ఎంసీఏ' (2017), 'శ్యామ్ సింగరాయ్' (2021) మంచి విజయం సాధించాయి. ప్రేక్షకుల నుంచి హిట్ పెయిర్‌గా గుర్తింపు కూడా పొందారు. శేఖర్ కమ్ములకు సాయిపల్లవి ఫేవరెట్ హీరోయిన్. ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'ఫిదా' ఆమెకు స్టార్‌డమ్ తీసుకొచ్చింది. ఆ తర్వాత 'లవ్‌స్టోరీ' కూడా మంచి స్పందన తెచ్చుకుంది. తెలంగాణ యాసలో సాయిపల్లవి చెప్పిన డైలాగులు ఇప్పటికీ ప్రేక్షకులను ఆకట్టు–కుంటు–న్నాయి. ఇప్పుడు అదే దర్శకుడు, అదే హీరోయిన్, కొత్తగా నానితో జత కట్టడం విశేషం.

## రాజసాబ్ విడుదలకు అడ్డంకులు

పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై ముంబై సంస్థ కేసు

టాలీవుడ్ బడా నిర్మాణ సంస్థపై కేసు నమోదయింది. తమను మోసం చేసారని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై ముంబైకి చెందిన ఐవివై ఎంటర్‌టెన్‌మెంట్స్ కేసు పెట్టింది. వివరాలలోకెళితే పీపుల్స్ మీడియా సంస్థ నిర్మాణంలో రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా రాజాసాబ్ అనే సినిమాను నిర్మిస్తోంది. అత్యంత భారీ బడ్జెట్ పై చాలా కాలంగా ఈ సినిమాను నిర్మిస్తోంది పీపుల్స్ మీడియా. అయితే వందల కోట్ల బడ్జెట్ తో పీపుల్స్ మీడియా నిర్మిస్తున్న ఈ సినిమాకు ముంబై కు చెందిన ఈ సంస్థ ఆర్థిక భాగస్వామిగా వ్యవహరిస్తోంది. సినిమా షూటింగ్ కు అయ్యే ఖర్చు తదితర వాటికి ఆర్థిక వనరులు సమకూర్చేలా ఇరు సంస్థలు ఒప్పందాలు చేసుకున్నాయి. గ్రాండ్‌గా షూటింగ్ స్టార్ట్ చేసిన పీపుల్ మీడియా మేకర్స్ ఈ సినిమా షూటింగ్ ను అనుకున్న టైమ్ లో ఫినిష్ చేయలేక పోయారు. ఇప్పటికే రాజాసాబ్ అనేకసార్లు రిలీజ్ వాయిదా పడుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో పీపుల్ మీడియా తమ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని, సినిమా షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయజేకుండా, తమకు ఎలాంటి సమాచారం అందించడం లేదని, మేము ఇచ్చిన డబ్బులు ఎలా ఉపయోగించారనే దానిపై వివరణ కూడా వివరన ఇవ్వలేదని చెబుతూ ఢిల్లీకోర్టులో కేసు నమోదు చేసింది. అలాగే మేము ఇచ్చిన డబ్బులో ప్రస్తుతం రూ. 218 కోట్లు– తిరిగి ఇవ్వాలని ఈ సంస్థ డిమాండ్ చేస్తోంది. ఇదిలా ఉండగా ఈ సినిమా ఇంకా నాన్–థియేట్రికల్ డీల్‌ను క్లోజ్ కాలేదని, అనుకొని కారణాల వలన రిలీజ్ వాయిదా వేసామని కావాలని తమ పరువుకు భంగం కలిగిస్తున్నారని ఐవివై సంస్థపై కోర్టును ఆశ్రయించింది పీపుల్స్ మీడియా.




## నేడు థియేటర్లలోకి వస్తున్న కూలీ

తలైవా వల్లనే దీనికి క్రేజ్ వచ్చిందన్న లోకేశ్

ఎప్పుడూ తన సినిమా సంగతులను పంచుకునే లోకేశ్ కనగరాజ్ వాటి విడుదలకు ముందు కచ్చితంగా పోస్ట్ పెడుతుంటారు. దీంతో 'కూలీ' విడుదలకు ముందు ఆయన పెట్టే పోస్ట్‌పై కొన్ని రోజులుగా అందరిలో ఆసక్తి నెలకొంది. ఆయన దర్శకత్వంలో రజనీకాంత్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'కూలీ'. నాగార్జున, ఆమీర్‌ఖాన్, సత్యరాజ్, శ్రుతిహాసన్, సౌబిన్ షాహిర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఆగస్టు 14న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఆయన ఈ సినిమాను ఉద్దేశిస్తూ రజనీకాంత్‌కు థాంక్స్ చెబుతూ పోస్ట్ పెట్టారు. ఆయన వల్లే ఈ సినిమాపై ప్రేక్షకులు ఇంత ప్రేమ చూపుతున్నారని పేర్కొన్నారు. చిత్రీకరణకు సంబంధించిన ఫొటోలను పంచుకున్నారు. నా సినీ ప్రయాణంలో 'కూలీ'కి ఎప్పుడూ ప్రత్యేక స్థానం ఉంటుంది. ఈ సినిమా ఇంత బాగా రావడానికి, దీనిపై ఇంత మంది ప్రేమ చూపించడానికి కారణం తలైవానే. నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ఆయనకు ఎప్పటికీ కృతజ్ఞతతో ఉంటా. 'కూలీ' చిత్రీకరణలో ఎన్నో మధురక్షణాలు ఉన్నాయి. వాటిని ఎప్పటికీ నా మనసులో దాచుకుంటాను' అని తెలిపారు. రజనీకాంత్ ఇండస్ట్రీక్రి వచ్చి మరో రెండు రోజుల్లో 50ఏళ్లు పూర్తి కానున్న సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంతో మందిలో స్ఫూర్తినింపుతున్నందుకు కృతజ్ఞతలు చెప్పారు.



## కూలీ, వార్-2 లకు పోటీగా ధూమకేతు

### బెంబేలెత్తిస్తున్న బెంగాల్ మూవీ

ఆగస్టు 14న గురువారం కూలీ, వార్2 మూవీలు పెద్ద ఎత్తున రిలీజ్ కాబోతున్నాయి. వీటిపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. కూలీలో సీనియర్ యాక్టర్లు వార్2లో యంగ్ అండ్ డైనమిక్ హీరోలు మీ సినిమానా మా సినిమానా అన్నట్లుగా పోటీ– పడుతున్నారు. ఎవ్వరూ ఎక్కడా తగ్గట్లేదు. ఆడియన్స్‌ని థియేటర్లకు రప్పించేందుకు చేస్తున్న ప్రమోషన్స్ పీక్స్‌కి చేరాయి. ఈ దశలో మరో మూవీ రిలీజ్ అయ్యేందుకు సాహసం చేస్తుందా. కానీ మేం చేస్తాం అంటోంది ఓ బెంగాలీ ఫిల్మ్. వార్2, కూలీ చిత్రాలతో పోటీ పడుతూ 'ధూమకేతు' అనే బెంగాలీ ఫిల్మ్ పశ్చిమ బెంగాల్లో ఆగస్టు 14నే రిలీజ్ అవుతోంది. వార్2, కూలీకి ఈ సినిమాకు ఏంటీ– పొంతన అని తక్కువగా తీసిపారేయొద్దు. ఉత్తరాదిలో వార్2. సౌత్‌లో కూలీ సినిమాలకు ఫుల్ అటెన్షన్ క్రియేట్ అవుతుంది. కానీ బెంగాల్‌లో మాత్రం ధూమకేతుకు విపరీతమైన క్రేజ్ ఏర్పడిరది. ఎంతలా అంటే ప్రీ బుకింగ్స్ సేల్స్‌లో ఈ లోకల్ సినిమాను వార్2 కూడా బీట్ చేయలేనంతలా. ధూమకేతు ఇప్పటి వరకు 21 వేల టికెట్లు– అమ్ముడవగా, వార్2కి కేవలం 6 వేల టికెట్లు– మాత్రమే తెగాయన్నది మార్కెట్ వర్గాల టాక్. ఇక కూలీని పెద్దగా పట్టించుకోవడం లేదు బెంగాల్ ఆడియన్స్.





## 16న కాళోజీ కళాక్షేత్రంలో
# జన్మాష్టమి వేడుకలు

- మాజీ కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్
- గొల్లకురుమల సాంస్కృతిక సమ్మేళనం

**వరంగల్ వాయిస్, రాంనగర్ :** ఉద్యమాల పురిటిగడ్డ ఓరుగల్లులో యాదవ వెల్ఫేర్ ట్రస్ట్–వరంగల్ ఆధ్వర్యంలో ఈ నెల 16న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు గొల్లకురుమలు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్తర తెలంగాణలో గొల్లకురుమల ఐక్యతను చాటేందుకు 'గొల్లకురుమ సాంస్కృతిక సమ్మేళనం' నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. వరంగల్ నగరంలోని కాళోజీ కళాక్షేత్రంలో జరిగే ఈ వేడుకలకు హర్యానా మాజీ గవర్నర్, మాజీ కేంద్ర మంత్రి దత్తాత్రేయ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విశిష్ట అతిథులుగా పాల్గొననున్నారు. మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, మండలి ప్రతిపక్ష నేత మధుసూధనాచారి, ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు వినయ్ భాస్కర్ వంటి ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఐదు వేల మంది వందే జగద్గురు భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్, మాజీ కుడా చైర్మన్ ఎస్.సుందర్ రాజ్ యాదవ్ తెలిపారు. హనుమకొండ రాంనగర్‌లోని బీసీ భవన్ నుంచి కాళోజీ కళాక్షేత్రం వరకు శ్రీకృష్ణుడి శోభాయాత్ర నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ యాత్రలో వేలాది మంది గొల్లకురుమలు, భగవత్ బంధువులు పాల్గొంటారన్నారు. రెండు వేల మంది యువత, జానపద కళాకారుల ఆటపాటలు యాత్రకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. సినీ రంగంలో పేరు ప్రఖ్యాతులు సంపాదిస్తున్న గొల్లకురుమ వర్ధమాన సంగీత దర్శకులు, రచయితలు, గాయకులు, జానపద కళాకారులు తమ సంస్కృతి, సంప్రదాయాలను ప్రదర్శిస్తారని వెల్లడించారు. గొర్రెల పెంపకందారుల ఫెడరేషన్ మాజీ చైర్మన్ కన్నెబోయిన రాజయ్య యాదవ్ మాట్లాడుతూ కాకతీయుల కాలం నుంచి చరిత్రలో యాదవులకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. అఖిల భారత యాదవ మహాసభ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గిరబోయిన రాజయ్య యాదవ్ మాట్లాడుతూ ఈ వేడుకలను విజయవంతం చేయడానికి ప్రజలందరూ కుటుంబాలతో సహా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యుడు కెంచ కుమారస్వామి, కార్పొరేటర్ బొంగు అశోక్, అఖిల భారత యాదవ మహాసభ జనగాం జిల్లా అధ్యక్షుడు సిద్ధిరాజ్ యాదవ్, యాదవ మహాసభ నేతలు బుట్టి శ్యాం యాదవ్, ఎల్లావుల కుమార్ యాదవ్, రాజేందర్ యాదవ్, మాదం రజిని కుమార్ యాదవ్, దూడయ్య యాదవ్, చెన్నమల్లు యాదవ్, సమ్మయ్య యాదవ్, టీవైఎస్ఎస్ రాష్ట్ర నేతలు బొంగు రాజు యాదవ్, బోయిని భిక్షపతి యాదవ్, పర్వతాలు యాదవ్, కనక రాజు యాదవ్, ప్రమోద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.





# ఫొటో జర్నలిస్ట్ శ్యాంకు.. జాతీయ స్థాయి మెరిట్ అవార్డు

- రెండో సారి ఎంపిక
- అభినందించిన పాత్రికేయులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం–2025 సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి వారి సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ విజయవాడ, ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్ సంయుక్త నిర్వహణలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో నిర్వహించిన పోటీల్లో వరంగల్ సీనియర్ ఫొటో జర్నలిస్ట్ గోకారపు శ్యాం కుమార్ కు ఏడు రంగుల వర్ణాల ఇంద్రధనస్సు ఛాయాచిత్రానికి జాతీయ స్థాయి అవార్డు లభించింది. అయితే జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక కావడం శ్యాం కుమార్ కు ఇది రెండో సారి. గతంలో కూడా శ్యాం కుమార్ కు జాతీయ స్థాయి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా గోకారపు శ్యాం కుమార్ ను పలువురు జర్నలిస్టులు ప్రశంసించారు.

### తృతీయ బహుమతికి వనం శరత్ బాబు ఎంపిక

వరల్డ్ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భముగా నిర్వహించిన పోటీల్లో వరంగల్ జిల్లా శంభునిపేట ప్రాంతానికి చెందిన వనం శరత్ బాబుకు రెండు రాష్ట్రాలలో కలిపి మూడో బహుమతికి ఎంపికయ్యారు. మోనోక్రోమ్ విభాగంలో బంగారు పతకం, నగతు పురస్కారం లభించడం జరిగింది. ఈ అవార్డును ఆగస్టు 18 వ తేదీ సోమవారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్ లో ప్రముఖుల సమక్షంలో అందుకోనున్నారు. గతంలో వనం శరత్ బాబు జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పాల్గొని 150 మెడల్స్, క్యాష్ అవార్డు కూడా అందుకోవడం జరిగింది. శరత్ బాబు ఎంపిక కావడంపై బజ్జూరి మధుసూదన్, రావుల బాలరాజు, ముప్ప మల్లేశం, అకుబత్తిని భిక్షపతి, పోతు రమేశ్ బాబు, ఎలుగు ఉపేందర్, బజ్జూరీ ప్రభాకర్, బక్కి నాగేంద్ర కుమార్, వరంగల్ జిల్లా యోగ అసోసియేషన్ అధ్యక్షుడు బొలిశెట్టి కమలాకర్, కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు మండల నరసింహ రాములు, వీరభద్ర పరపతి సంఘం అధ్యక్షులు బక్కి వీరసాయి ప్రసాద్, మిత్ర పరపతి సంఘం అధ్యక్షులు చిగిరి కుమారస్వామి, జనతా పరపతి సంఘం అధ్యక్షులు కేడల మల్లేశం, జై హనుమాన్ అధ్యక్షుడు పోషాల మల్లికార్జున్, కోల రాము, జక్కం దామోదర్, ఎలుగు రవికుమార్, బొల్లపెల్లి రాజు, కొండ్రెడ్డి నవీన్ రెడ్డి అభినందించారు.

# జాతీయ రహదారి మరమ్మత్తులు వెంటనే పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**వరంగల్ వాయిస్, ములుగు:** ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మల్లంపల్లి, జాకారం మధ్య ఉన్న 163 జాతీయ రహదారిపై ఉన్న ఎస్ఆర్ఎస్పీ పాత వంతెన దెబ్బతింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ పరిస్థితిపై స్పందించిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్. వెంటనే తాత్కాలిక వంతెన నిర్మాణ పనులను చేపట్టి రెండు రోజుల్లో పూర్తి చేయాలని నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. తాత్కాలిక వంతెన నిర్మాణం పూర్తయ్యే వరకు మల్లంపల్లి–ములుగు మార్గంలో వాహనాల రాకపోకలను మళ్లించాలన్నారు. భారీ వాహనాలు వరంగల్ నుంచి ములుగు వెళ్లేందుకు గూడెప్పాడ్, పరకాల, రేగొండ, జంగాలపల్లి, తిరిగొచ్చే మార్గం జంగాలపల్లి, రేగొండ, పరకాల, గూడెప్పాడు మీదుగా ప్రయాణించాల్సి ఉంటుందన్నారు. అదే విధంగా వరంగల్ నుంచి ములుగు, ఏటూరునాగారం వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులు, కార్లు, టూ వీలర్లు మల్లంపల్లి, శ్రీనగర్, పందికుంట, ములుగుకు ప్రయాణించవచ్చన్నారు. అదే విధంగా జాకారం, అబ్బాపూర్, గోరుకొత్తపల్లి, వరంగల్ కు తిరిగి చేరుకోవచ్చన్నారు. ఆర్టీసీ ప్రయాణికుల కోసం మల్లంపల్లి,



శ్రీనగర్, పందికుంట గ్రామాల మీదుగా ప్రయాణిస్తాయన్నారు. ఈ మార్గంలో భారీ వాహనాలకు అనుమతి లేదని వెల్లడించారు. ప్రయాణికులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎన్‌హెచ్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఇబ్బందులు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్ భాస్కర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారీ వర్షాల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం కనీస చర్యలు చేపట్టడం లేదని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ విమర్శించారు. బుధవారం సాయంత్రం ఆయన బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి 4వ డివిజన్ జ్యోతి బసు నగర్, 5వ డివిజన్ డబ్బాల్ పెద్ద మోరి, నయీంనగర్ నాలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారీ వర్షాలకు బస్తీలు మునిగిపోతున్నా ఇంతవరకు మున్సిపల్, రెవెన్యూ అధికారులు సహాయక చర్యల్లో పాల్గొనడం లేదని ఆరోపించారు. జ్యోతి బసు నగర్‌లో నిలిచిన నీటిని తోడేందుకు జేసీబీ పంపమని మున్సిపల్ అధికారులను అడిగితే డీజిల్ లేదని చెప్పడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్, సంకు నర్సింగ్ రావు, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, నాయకులు మనోజ్ కుమార్, సదాంత్, ప్రణయ్, రామ్మూర్తి, జయరాం, దశరథ్, మనోహర్, శ్యామ్, మహమూద్, రామ్ చందర్, రాజు, వినీల్ రావు, విజయ్ రెడ్డి, మహేందర్, రవి, వీరస్వామి, ఖుద్దుస్, రాజేష్, రమేష్, సుధాకర్, జేకే తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com